## క్లుప్తంగా

### భక్తి శ్రద్ధలతో లక్ష దళార్చన పూజలు



లక్ష దళార్చన పూజలు చేస్తున్న అయ్యప్పస్వాములు

టెక్కలి: స్థానిక రోణంకి అప్పలస్వామి వీధిలో భక్తి శ్రద్ధలతో అయ్యప్పస్వామికి ఆదివారం లక్ష దళార్చన పూజలు నిర్వహించారు. పట్టణంలోని అయ్యప్పస్వాములంతా ముందుగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వాములంతా లక్ష దళాలతో పూజలు చేశారు.

### పాగురు తీసిన రైతులు



డొంకూరు తీరంలో సముద్రం-ఉప్పుటేరు మధ్య తొలగించిన ఇసుకమేటలు

ఇచ్ఛాపురం రూరల్: డొంకూరు సముద్రం, ఉప్పుటేరుకు మధ్య ఉన్న ఇసుక మేటను స్థానిక మత్స్యకారులు తొలగించారు. మూడు నెలల పాటు ఇసుక మేట వేయడంతో మత్స్యకారుల తెప్పలు, పడవలను లంగరు వేయడానికి కష్టంగా ఉండేది. అలాగే తుఫాన్‌తో భారీ వర్షాలు ఉన్నట్లు వాతావరణ శాఖ ప్రకటించడంతో 'పాగురు'తో అన్నదాతలు గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. ఇసుక మేటలు తొలగించకపోతే వరదలకు ఉప్పుటేరు ఎక్కడ తమ పంట పొలాలను ముంచుస్తుందో అని భయపడ్డారు. దీంతో గ్రామ పంచాయతీ, వేట సాగించే మత్స్యకారులు స్పందించి సుమారు మూడు లక్షల రూపాయలతో రెండు రోజుల నుంచి ఇసుక మేటలు తొలగించే పనిలో పడ్డారు. ఎట్టకేలకు శనివారం రాత్రి పాగురు తీయడం జరిగిందని సర్పంచ్ బుడ్డ కళ్యాణ్ తెలిపారు.

### ఘనంగా కార్తీక మాస పూజలు



పూజల్లో ఎంపీపీ దాస్ తదితరులు

సోంపేట: జింకిభద్ర గ్రామంలోని నీలకంఠేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక ఆదివారాన్ని పురస్కరించుకుని కార్తీక మాస నగర సంకీర్తనను చేపట్టారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజనలు, తిరువీధి నిర్వహించారు. అనంతరం దేవాలయం ఆవరణలో భక్తులు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ఎంపీపీ నిమ్మన దాస్ పూజల్లో పాల్గొన్నారు.

### శ్మశానంలో బోరు ఏర్పాటు



బోరును ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: మండపల్లి పంచాయతీలోని శ్మశాన వాటికలో ప్రభుత్వ నిధులతో బోరును ఆదివారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ పిట్ట మామయ్యరెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాతిర్ల వెంకటేష్, బర్రి బాబయ్య, డాలురెడ్డి, శారధిరెడ్డి, పాతిర్ల జోగారావు, యర్రయ్య పాల్గొన్నారు.

### యూవీవీ గ్రంథాలయానికి కుర్చీలు వితరణ



కుర్చీలను వితరణగా అందజేసిన దృశ్యం

పలాస: పెద్దనీలావతిలోని ఉద్దానం ప్రాంత విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయానికి సహోదర యువజన సంఘం అధ్యక్షుడు కుత్తుం నీలకంఠం (అండమాను)రూ.13 వేలు విలువైన 25 కుర్చీలను వితరణగా అందజేశారు. నీలకంఠం పుట్టిన రోజు సందర్భంగా ఈ సహాయాన్ని అందజేశారు. యూవీవీ అధ్యక్షుడు ఇసాకోటి జోగారావు, ప్రధాన కార్యదర్శి బొడ్డు చిన్నారావు, గ్రంథాలయ నిర్మాణ కమిటీ కన్వీనరు కుత్తుం ప్రకాశరావు పాల్గొన్నారు.

### విశ్రాంతి భవన నిర్మాణానికి శంకుస్థాపన

కంచిలి: పోలేరు పంచాయతీ పరిధి గంగాధరపురం గ్రామంలో ప్రయాణికుల విశ్రాంతి భవనం నిర్మాణానికి మండల పరిషత్ నిధులు రూ. మూడు లక్షలు మంజూరయ్యాయి. ఈ పనులకు ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లద్దుకేశవపాత్రో పాల్గొన్నారు.

# బీఎల్‌వోలు సక్రమంగా పని చేయాలి

● కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

కంచిలి: బూత్ లెవల్ అధికారులు సక్రమంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. మకరాంపురం పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం పరిశీలించారు. బూత్ లెవల్ అధికారితో మాట్లాడారు. బీఎల్‌వోలు ఓటర్ల ప్రక్రియ డిసెంబర్ ఏడో తేదీలోగా పూర్తి చేయాలన్నారు. సక్రమంగా విధులు నిర్వహించకపోతే చర్యలు తప్పవన్నారు.

**అర్హులందరినీ ఓటరుగా చేర్పండి**

టెక్కలి: అర్హులందరినీ ఓటరుగా చేర్చాలని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమార్ ఆదేశించారు. టెక్కలి నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల వద్ద ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను ఆయన పరిశీలించారు. టెక్కలి మండలం కె.కొత్తూరు పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక నమోదును పరిశీలించి సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరుగా చేర్పులు, మార్పులు, పోలింగ్ స్టేషన్ చేర్పులు, మార్పులు, ఓటర్ల తొలగింపు తదితర నమోదు ప్రక్రియను బాధ్యతగా నిర్వర్తించాలని పేర్కొన్నారు. ఈయనతో పాటు తహసీల్దారు కె.ప్రవల్లిక ఉన్నారు.

**ఓటు నమోదుకు యువత ముందుకు రావాలి**

వజ్రపుకొత్తూరు: వచ్చే ఏడాది జనవరి నాటిక 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు కావాలని తహసీల్దార్ బి.అప్పలస్వామి అన్నారు. ఉంద్రుకుడియా, బెండి, కిడిసింగి, డోకులపాడు, రిట్టపాడు పోలింగ్ కేంద్రాలను ఆదివారం పరిశీలించారు. అక్కడ నమోదు అవుతున్న కొత్త ఓటర్ల వివరాలు, దరఖాస్తులను పరిశీలించారు. మండల వ్యాప్తంగా కొత్తగా 61 మంది ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోగా, ఓటరు జాబితా నుంచి ఓటు తొలగించేందుకు 26 దరఖాస్తులు, ఓటరు వివరాలు సవరించాలంటూ 188 దరఖాస్తులు వచ్చాయన్నారు. ప్రతీ గ్రామంలో జల్లెడ పట్టి మరీ కొత్త ఓటర్లను నమోదు చేయాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. కార్యక్రమంలో రీసర్వే ఉప తహసీల్దార్ వనిత, బీఎల్‌ఓలు, వీఆర్వోలు పాల్గొన్నారు.



కంచిలి: మకరాంపురంలో ఓటర్ల జాబితా పరిశీలిస్తున్న కలెక్టర్ లాఠకర్

**ముగిసిన ఓటర్ల ప్రత్యేక నమోదు ప్రక్రియ**

ఇచ్ఛాపురం: ప్రత్యేక ఓటర్ల నమోదు ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు శని, ఆదివారాల్లో నియోజకవర్గంలోని 299 పోలింగ్ కేంద్రాల వద్ద ఈ ప్రక్రియను చేపట్టారు. నియోజకవర్గం వ్యాప్తంగా ప్రత్యేక నమోదు కార్యక్రమంలో 1010 మంది ఫారం-6, 143 మంది ఫారం-7, 262 మంది ఫారం-8 దరఖాస్తులను బీఎల్‌వోలు స్వీకరించినట్లు ఎలక్షన్ డీటీ శ్రీహరి తెలిపారు. ప్రత్యేక ఓటర్ల నమోదు ప్రక్రియను తహసీల్దార్ మీనాదేవి పరిశీలించారు.

కోటబొమ్మాళి: పెద్దబమ్మిడి, ఎత్తురాళ్లపాడు, ఎలమంచిలి, కోటబొమ్మాళి పంచాయతీల్లోని పోలింగ్ కేంద్రాలను టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్‌కమార్ పరిశీలించారు. ఓటు హక్కు కోసం చేసుకున్న దరఖాస్తులన పరిశీలించి బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ, డిప్యూటీ తహసీల్దార్ ఆర్.మధు, ఆర్ఐ శివరామకృష్ణ పాల్గొన్నారు.



కె.కొత్తూరులో ఓటరు నమోదును పరిశీలిస్తున్న నూరుల్ కమార్

ఇచ్ఛాపురం రూరల్: బూర్జపాడు, కేశుపురం, ఈదుపురం పోలింగ్ స్టేషన్లను ఎన్నికల ఉప తహసీల్దార్ బలివాడ శ్రీహరి సందర్శించారు. ప్రత్యేక ఓటర్ల నమోదును పరిశీలించారు.



వజ్రపుకొత్తూరు: ఉంద్రుకుడియాలో ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న అప్పలస్వామి



ఇచ్ఛాపురం రూరల్: డొంకూరు పోలింగ్ కేంద్రంలో దరఖాస్తు స్వీకరిస్తున్న సిబ్బంది



కోటబొమ్మాళిలోని హైస్కూల్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్ కమార్

## అలయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

ఇచ్ఛాపురం: పట్టణానికి చెందిన అలయన్స్ క్లబ్ స్వచ్ఛందసంస్థ సేవలు అభినందించదగ్గవని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో క్లబ్ వార్షికోత్సవాన్ని అధ్యక్షుడు ఎల్.నరసింహమూర్తి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చైర్‌పర్సన్ క్లబ్ చేసిన సేవలను కొనియాడారు. క్లబ్ గవర్నర్ విద్యాసాగర్ మాట్లాడుతూ.. క్లబ్ చేపట్టనున్న లక్ష్యాలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎస్.రమేష్, విశ్రాంత ఉపాధ్యాయులు రాంప్రసాద్, కె.మోహన్‌రావు, సీనియర్ న్యాయవాది ఎస్.సి.సాహు, క్లబ్ కార్యదర్శి టి.లక్ష్మణ్‌రావు, సభ్యులు బత్తుల వెంకటరమణ, గోపీనాథ్‌రెడ్డి, ఉమాశంకర్, యోగి, బుజ్జి, లోహిదాస్, సత్యమయ్య, నరసింహమూర్తి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజలక్ష్మి

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

సోంపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద అన్నారు. పలాసపురం గ్రామంలో సర్పంచ్ జోగారావు అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న సంక్షేమ పథకాలు గురించి జెడ్పీటీసీ సభ్యురాలు గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బెందాళం వెంకటరమణ, కార్యదర్శి కామేశ్వరరావు, ఏపీఎం ప్రమీళ, కొర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారిణి సౌజన్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు యశోద

**లింగనిర్ధారణ చట్టరీత్యా నేరం**

లింగనిర్ధారణ చట్టరీత్యానేరమని పలాసపురం సర్పంచ్ తడక జోగారావు అన్నారు. గ్రామంలో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగాగా జాతీయ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. గ్రామంలో సదస్సు, ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. సమాజంలో లింగ వివక్షత ఉండకూడదన్నారు. లింగనిర్ధారణ చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

### డ్రగ్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శికి సన్మానం



కరుణాకరన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

సోంపేట: సోంపేట మండలం డ్రగ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బారువలో ఆదివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్రకార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు కరుణాకరన్ గుప్తాకు సంఘం ఆధ్వర్యంలో దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి డ్రగ్స్ యాజమాన్య ప్రతినిధులు పలు సలహాలు సూచనలు అందించారు. సంఘప్రతినిధులు శ్రీనుపాణిగ్రాహి, రామరాజు, వజ్జకృష్ణ, గోపాల్ పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న గణిత దశావధానం

సోంపేట: సోంపేట పట్టణంలోని టీడీఆర్ కోచింగ్ సెంటర్‌లో గణిత దశావధాని మద్దు తిరుపతిరావు ఆధ్వర్యంలో ఆదివారం గణిత దశావధానం జరిగింది. విద్యార్థులు, పృచ్ఛకులు అడిగిన ప్రశ్నలకు గణితదశావదాని క్షణాల్లో సమాధానం చెప్పి ఆకట్టుకున్నారు. విద్యార్థుల్లో గణితంపై ఉన్న భయం పోగొట్టేందుకు పలు సూత్రాలను వివరించారు. ఉపాధ్యాయ సిబ్బంది టి.ధర్మరాజు, హరికృష్ణ, లక్ష్మణరావు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీరామకృష్ణ సేవాసమితి వార్షికోత్సవం




నగరసంకీర్తనలో చిన్నారులు, భక్తులు



సమ్మేళనంలో భక్తులు

కాశీబుగ్గ: మోదుగులపుట్టి గ్రామంలో శ్రీరామక్రిష్ణ సేవా సమితి 23వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తజన సమ్మేళన కార్యక్రమంలో స్వామీజీ కృష్ణచరణ్‌దాస్, భద్రాచలం రంగారావు, అల్యాన వినయ్‌కుమార్, దువ్వాడ సుబ్బలక్ష్మి తదితరులు ముఖ్యప్రవచకులగా హాజరై భగవద్గీతలో కొన్ని అంశాలను స్పృశించారు. ఉదయం నగర సంకీర్తనలు, భజన కార్యక్రమం, ఆధ్యాత్మిక ప్రసంగం, ప్రసాదవితరణ (నారాయణసేవ)భక్తులతో నిర్వహించారు.

### పెళ్లైన మూడు నెలలకే మృతి!



తాళాసు స్పందన (ఫైల్)

కాశీబుగ్గ: పెళ్లైన మూడు నెలలకే యువతి మృతి చెందింది. ఈ సంఘటన పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి రోటరీనగర్ పాంతంలో ఆదివారం చోటుచేసుకోగా.. తాళాసు స్పందన ఆసక్మికంగా ఆదివారం ప్రాణాలు కోల్పోయింది. శ్రీనివాసరావుతో ఈ ఏడాది ఆగస్టు 30న వివాహమైంది. ఉదయం కడుపు నొప్పితో ఆస్పత్రికి వెళ్లిన స్పందన మరణించడంతో వారి కుటుంబాల్లో విషాదం నెలకుంది.

## ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ అర్హత పరీక్ష

టెక్కలి: జాతీయ ఉపకార వేతనాల అర్హత కోసం ఆదివారం టెక్కలిలో నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత, బాలికల ఉన్నత పాఠశాల, ఏపీఎంజేపీ, రవీంద్రభారతి, బీఎస్ అండ్ జేఆర్, ఆర్‌సీఎం తదితర పాఠశాలల్లోని ఒక్కో సెంటర్‌కు 240 మంది చొప్పున విద్యార్థులను కేటాయించారు. ఉప విద్యా శాఖాధికారి జి.పగడాలమ్మ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.



బాలికల ఉన్నత పాఠశాల కేంద్రంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

**ఇంగ్లిష్ మీడియం విద్యార్థికి తెలుగు ప్రశ్నాపత్రం!**

టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వజ్జ వంశీకృష్ణ అనే విద్యార్థి ఇంగ్లిష్ మీడియంలో 8వ తరగతి చదువుతున్నాడు. ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష కోసం పాఠశాల సిబ్బంది ఆయా విద్యార్థి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినప్పుడు తెలుగు మీడియంగా ఎంటర్ చేశారు. శనివారం హాల్‌టికెట్‌ను తీసుకుని పరిశీలించగా అందులో తెలుగు మీడియం నమోదు చేసి ఉండడంతో ఖంగుతిన్నాడు. తండ్రి గోపాలకృష్ణతో కలిసి ఆదివారం పాఠశాలకు చేరుకుని విషయాన్ని ప్రధానోపాధ్యాయుడు నాగభూషణ్ వద్ద ప్రస్తావించారు. అయితే సరైన సమాధానం రాకపోవడంతో విద్యా శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తానని విద్యార్థి తండ్రి గోపాలకృష్ణ తెలిపారు.

### డయాలసిస్ రోగికి రూ.10 వేల పింఛన్ అందజేత



పింఛన్ అందుకుంటున్న అప్పారావు

కాశీబుగ్గ:బొడ్డపాడు గ్రామానికి చెందిన గేదెల అప్పారావుకు రెండు కిడ్నీలు పాడయ్యాయి. దీంతో డయాలసిస్ రోగి కావడంతో ఇతనికి రూ. పది వేలు పింఛన్ కొత్తగా మంజూరైంది. ఈ మొత్తాన్ని నాయకులు అప్పారావుకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తామాడ మధన్, ఎంపీటీసీ సభ్యుడు మద్దిల పాపారావు, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బుడత ధనరాజు పాల్గొన్నారు.

### విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు హాజరై మాట్లాడారు. దివ్యాంగులకు శారీరకంగా లోటు ఉండవచ్చుకాని మానసికంగా ధైర్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర టి.నాగేంద్రకుమార్, కౌన్సిలర్లు సనపల సింహాచలం, పప్పల ప్రసాద్, బల్ల రేవతిశ్రీనివాస్, దున్న సత్యం, పప్పల ప్రసాద్, దువ్వాడ రమణయ్య, మెప్మా సీవో స్వప్నకుమారి పాల్గొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం

● కేంద్ర మాజీ మంత్రి కృపారాణి

టెక్కలి: దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తోందని కేంద్రమాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జాతీయ దివ్యాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం ఉండాలన్నారు. శారీరక, మానసిక లోపం కలిగిన వారు దివ్యాంగులు కాదని ఆత్మస్థైర్యం లేని వారు మాత్రమే దివ్యాంగులన్నారు. దివ్యాంగుల రక్షణ కోసం ప్రభుత్వం చట్టాలను మరింత పటిష్టం చేసిందన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు ఎ.వేణుగోపాల్, ఎంపీటీసీ సభ్యుడు వి.శ్రీధర్‌రెడ్డి, సీపీఎం నాయకుడు కె.ఎల్లయ్య, దివ్యాంగుల హక్కుల వేదిక ప్రతినిధులు బి.మాధవరావు, మోహన్‌రావు, చంద్రశేఖర్, పీతాంబరం, నూకమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృపారాణి

## రాయికోలలలో పంటకోత ప్రయోగం

మందస: మెలకువలు పాటిస్తూ, ప్రకృతి వ్యవసాయం చేస్తే ఎంతో మేలు జరుగుతుందని జెడ్పీటీసీ సభ్యురాలు సవర చంద్రమ్మ, ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ సంజీవరావు అన్నారు. నర్సింగపురం యూనిట్ గిరిజన గ్రామమైన రాయికోలలో ప్రకృతి వ్యవసాయంతో పండించిన వరిపంట కోత ప్రయోగాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంట కోత ప్రయోగంతో రైతులకు దిగుబడి ముందుగానే అంచనా వేసి తెలుసుకునే అవకాశం ఉందన్నారు. నీటి ఎద్దడి ఉన్నప్పటికీ ఈ ఏడాది ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటల దిగుబడి మెరుగుపడిందన్నారు. ఏటీఎం, డ్రాట్ ప్రూఫింగ్ మోడల్‌ను రైతులు వేసుకుని, భూమిని 365 రోజులు ఏదైనా పంటతో కప్పి ఉంచవచ్చన్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి లక్ష్మణరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎస్.శ్రీరాములు, సవర బాలకృష్ణ, గిరిజన రైతులు పాల్గొన్నారు.



పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న దృశ్యం

## శివసాగర్ బీచ్‌కు పర్యాటకుల తాకిడి



శివసాగర్ తీరంలో సందడి చేస్తున్న పర్యాటకులు

వజ్రపుకొత్తూరు రూరల్: శివసాగర్ బీచ్ ఆదివారం పర్యాటకులతో సదండిగా మారింది. ఒడిశా ఆచారం ప్రకారం కార్తీక మాసం ముగియడంతో ఒడిశా ప్రాంతంలోని పలు గ్రామాలతో పాటు కాశీబుగ్గ, పలాస, టెక్కలిపట్నం, గొప్పిలి, తీరం పరిసర ప్రాంతాల నుంచి పర్యాటకులు అక్కుపల్లి శివసాగర్ తీరానికి చేరుకున్నారు. పరిసర తోటల్లో వనభోజనాలు చేసి తీరంలో ఆట పాటలతో సందడి చేశారు. సముద్ర స్నానాలు చేసి ఆనందంగా గడిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మెరైన్ పోలీసులు, స్థానిక పోలీసులు పర్యాటకులను అప్రమత్తం చేశారు.

# తక్షణ సాయం అందజేత

మందస: దేవుపురం గ్రామానికి చెందిన నెయ్యిల రమేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈయన వైఎస్సార్ బీమా పాలసీదారు. దీంతో తక్షణసాయంగా రూ. పది వేలు మంజూరైంది. ఈ మొత్తాన్ని నామినీగా ఉన్న రమేష్ భార్య నీలవేణికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచ్ గేదెల పద్మనాభం, సచివాలయం కన్వీనర్ తమిరియా శోభన్‌బాబు చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సిలగాన భాస్కరరావు, పినకాన ఉమాశంకర్, నర్సింగపురం సచివాలయం పంచాయతీ కార్యదర్శి నందిని, వెల్ఫేర్ అసిస్టెంట్ కృష్ణారావు పాల్గొన్నారు.



నీలవేణికి సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

## దివ్యాంగుల పునరావాస కేంద్రానికి భూమిపూజ

కంచిలి: మండపల్లిలోని సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వానప్రస్థాశ్రమం ఆవరణలో దివ్యాంగుల పునరావాస కేంద్ర భవన నిర్మాణాన్ని నిర్మించనున్నారు. సోంపేటకు చెందిన అవయవ దాత దివంగత మల్లారెడ్డి కిరణ్‌చంద్ జ్ఞాపకార్థం దీన్ని నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించిన పనలకు కిరణ్‌చంద్ తల్లిదండ్రులు మోహనరావు, తల్లి గిరిజా కళ్యాణిల చేతులమీదుగా ఆదివారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీన ఢిల్లీరావు, సీతయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుళ్ల రమేష్, మోహనరావు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న దృశ్యం

## ఘనంగా యూటీఎఫ్ స్వర్ణోత్సవం

కోటబొమ్మాళి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) స్వర్ణోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర, వారి సమస్యలపై మాట్లాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రతినిధులు గొండు నారాయణరావు, మెండ గోవిందరావు, పి.అప్పారావు, సామ సంజీవరావు ఉన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు